ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us &
Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 268 ఆదివారం 22-9-2024 ఎడిటర్ : వేములు అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..


# దంచికొట్టిన వాన..

**హైదరాబాద్‌లో భారీ వర్షం**

**రోడ్లను ముంచేసిన వరద భారీ ఎత్తున ట్రాఫిక్‌జాం**

**లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి పోటెత్తిన నీళ్లు**

**మరో 4 రోజుల పాటు భారీ వర్షాలు.. ఎల్లో అలర్ట్**



**హైదరాబాద్ సెప్టెంబరు 21:** ఉరుము తీవ్రమే.. మెరుపూ తీవ్రమే! ఈ రెండింటినీ తలదన్నేలా వాన!! ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్టుగా భారీగా కురిస్తే వాన మొదలైన క్షణాల్లో వరద పోటెత్తింది. పార్క్ చేసిన బైక్‌లు కొట్టుకుపోతాయేమో అన్నట్టుగా.. కార్లు సగం దాకా మునిగిపోయేలా వరద ఉధృతి కొనసాగింది. ఏది రోడ్డో... ఏది గుంతో.. ఏది కాలువో తెలియనంతగా ఎటు చూసినా వరద కుమ్మేసింది. హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం వరుణుడి ప్రకోపమిది! గంటకుపైగా వర్షం దంచికొట్టింది. ప్రధాన రాహదార్లలో మోకాలి లోతులో నీళ్లు నిలిచి చెరువులను తలపించాయి. దీంతో రహదారులపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలదైతే మరీ దయనీయ స్థితి. బస్తీలు, కాలనీల్లోకే కాదు.. ఇళ్లలోకి వరద పోటెత్తింది. ఖైరతాబాద్‌లోని ఎంస్‌మక్తా, బేగంపేట బ్రాహ్మిణివాడి, లంగర్‌హౌస్, యూసుఫగూడ శ్రీకృష్ణానగర్ బి-బ్లాక్, లక్ష్మీనర్సింహనగర్ ప్రాంతాల్లో ఇళ్లలోకి వరదనీరు రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం రాత్రి 9 గంటల వరకు లంగర్‌హౌసలో 9.1, ఖైరతాబాద్ గణాంకభవన్ వద్ద 8.6 సెం.మీ వర్షపాతం నమోదైంది.. బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి ప్రధాన రహదారిలో కిలోమీటర్ ప్రయాణానికి గంటకుపైగా సమయం పట్టింది. రోడ్లపై వరదనీరు భారీగా నిలిచిపోవడంతో తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ బృందాలు రంగంలోకి దిగి వరదనీటిని తొలగించాయి. వర్షంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు నెలకొనడంతో చీకట్లు కమ్ముకున్నాయి. ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో ఎక్కువ మంది మెట్రోను ఆశ్రయించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల వర్షం పడింది. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, మహబూబాద్ జిల్లాల్లో వర్షం పడింది. పిడుగుపాటుకు ఆదిలాబాద్ జిల్లా బేలలో రాథోడ్ అవినాశ్ (22) యువ రైతు మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం దిగ్వాల్‌లో 9.8 సెం.మీ వర్షపాతం నమోదైంది.

**మరో నాలుగు రోజులు వర్షాలే..**

రాష్ట్రానికి మళ్లీ భారీ వర్ష సూచన ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నాలుగు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈనెల 25 వరకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఆవర్తనం కారణంగా 23న వాయవ్య, దాని పరిసర పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది.

## ఢిల్లీ సిఎంగా అతిశీ ప్రమాణం



**న్యూఢిల్లీ,సెప్టెంబర్21:** దేశ రాజధాని ఢిల్లీ నూతన ముఖ్య మంత్రిగా అతిశీ శనివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. దేశ రాజధానికి 8వ యువ ముఖ్యమంత్రి ఆమెనే కావడం విశేషం. అతిషితోపాటు కేబినెట్‌లో కొత్త ముఖాలకు చోటిచ్చారు. నూతన మంత్రులుగా సౌరభ్ భరద్వాజ్, కైలాష్ గహ్లోత్, గోపాల్ రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, ముఖేష్ అహ్లావత్ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోదియా, ఆప్ నేతలు హాజరయ్యారు. షీలాదీక్షిఆత్, సుష్మాస్వరాజ్ తరవాత అతిషి ఢిల్లీ మూడో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు.

## అమెరికా పర్యటనకు బయలుదేరిన భట్టి

**అంతర్జాతీయ మైనింగ్ ఎక్స్‌పోకు హాజరు**



**హైదరాబాద్,సెప్టెంబర్21:** తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అధికారుల బృందం అమెరికా, జపాన్ దేశాల పర్యటనకు బయలుదేరి వెళ్లింది. మైనింగ్, గ్రీన్ పవర్ విభాగాలకు సంబంధించి ఆధునిక పద్ధతులు, లోతైన అధ్యయనంతోపాటు పెట్టుబడులను ఆహ్వానించడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అధికారుల బృందం ఈ రోజు హైదరాబాద్ నుంచి అమెరికాకు బయలుదేరింది. ఈనెల 21 నుంచి అక్టోబర్ 4 వరకు పర్యటన కొనసాగనుంది. మైనింగ్, గ్రీన్ పవర్ విభాగాలకు సంబంధించి ఇంటర్నేషనల్ ఎక్స్-పోతోపాటు, ప్రముఖ కంపెనీల ప్రధాన కార్యాలయాల సందర్శన, పెట్టుబడిదారులతో డిప్యూటీ సీఎం సమావేశం కానున్నారు. ఈనెల 24,25 తేదీల్లో అమెరికాలోని లాస్‌వేగాస్‌లో జరగనున్న అంతర్జాతీయ మైనింగ్ ఎక్స్‌పోలో పాల్గొంటారు. అక్కడ వివిధ కంపెనీల సీఈఓలు, ప్రతినిధులతో చర్చలు జరుపుతారు. ఈనెల 26న లాస్ ఏంజెల్స్‌కు చేరుకుంటారు. ఈనెల 27న ఎడ్ వార్డ్స్, సన్ బోర్న్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ విధానాన్ని పరిశీలిస్తారు. ఈనెల 28వ తేదీన పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులతో సమావేశమవుతారు. ఈ నెల 29న టోక్యోకి చేరుకుంటారు. ఈనెల 30న స్థానిక పెట్టుబడిదారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తారు. అక్టోబర్ 1న పెట్టుబడిదారులతో వ్యక్తిగతంగా (వన్ టు వన్) సమావేశమవుతారు. యామాన్ని గ్రీన్ హైడ్రోజన్ ఎ÷-లాంటును సందర్శిస్తారు. అక్టోబర్ 2న తోషిబా, కవాసాకి, అక్టోబర్ 3న పానసోనిక్ ప్రధాన కార్యాలయాలను సందర్శిస్తారు, అక్టోబర్ 4న హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు. ఈ పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు ÷నాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ బలరాం నాయక్ తదితరులు వెళ్లారు.

## మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్స్

**ఐటిఐల్లో సిలబస్ మార్పులు చేయాలి**

**అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచన**



**హైదరాబాద్,సెప్టెంబర్21:** మార్కెట్ అవసరాలకు అనుగుణమైన కోర్సులను ఐటీఐ ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కోర్సులకు అవసరమైన సిలబస్ రూపకల్పనకు కమిటీని నియమించి, నిపుణులు, విద్యావేత్తలు సలహాలు, సూచనలు స్వీకరించాలని ఆదేశించారు. సచివాలయంలో కార్మిక, ఉపాధి క ల్పన శాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రతి ఐటీఐ కళాశాలలకు ప్రిన్సిపాళ్లు ఉండేలా చూడాలని, శిక్షణ తీసుకుంటున్న వారికి సమగ్రమైన శిక్షణ అందేలా జాగ్రత్తపడాలని సూచించారు. ఐటీఐ కళాశాలల పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ కొత్త ఏటీసీలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. ఐటీఐ, ఏటీసీలేని అసెంబ్లీ సెగ్మెంట్లను గుర్తించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరం మినహా 100 నియోజకవర్గాల్లో ఐటీఐ, ఏటీసీలు ఉండేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. వృత్తి నైపుణ్యం అందించే ఐటీఐ, ఏటీసీ, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చేలా విధి విధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## అమృత్ టెండర్లపై కెటిఆర్ దుష్ప్రచారం

**- నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా - లేకుంటే కెటిఆర్ రాజీనామా చేస్తారా**

**- కెటిఆర్ వ్యాఖ్యలపై పరువునష్టం దావా వేస్తా - మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**హైదరాబాద్,సెప్టెంబర్21:** భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యలపై పరువునష్టం దావా వేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.రూ.8,888 కోట్లకు టెండర్లు పిలిచినట్లు కేటీఆర్ నిరూపిస్తే నేను రాజీనామాకు సిద్ధం. నిరూపించలేకపోతే కేటీఆర్ రాజీనామా చేస్తారా? అని సవాల్ చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.8,888 కోట్ల టెండర్లు ఎవరు దక్కించుకున్నారో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. టెండర్లను గత ప్రభుత్వమే రూ.3,616 కోట్ల చొప్పున 3 ప్యాకేజీలుగా పిలిచిందని వివరించారు. పోలింగ్ తేదీకి ఒక్కరోజు ముందే గత ప్రభుత్వం ఈ టెండర్లను కట్టబెట్టిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం కేవలం రూ.3,516 కోట్ల పనులకే టెండర్లు పిలిచింది. గత ప్రభుత్వంలో మిషన్ భగీరథ పేరు మీద రూ.39వేల కోట్ల ప్రజాధనం లూటీ చేశారు. విమర్శనాత్మకంగా ఉండే విమర్శలు చేయాలని కేటీఆర్‌కు సూచిస్తున్నట్లు వెల్లడించారు. ఆధారాలతో కూడిన విమర్శలు చేయాలి. ఖమ్మంలో నాపై పోటీ చేసిన ఉపేందర్‌రెడ్డి అల్లుడు సృజన్‌రెడ్డి ఒకటి దక్కించుకున్నారు. టెండర్లు వేయొద్దని ఏ కంపెనీని కూడా ప్రభుత్వంలోని పెద్దలు బెదిరించలేదు. మేం పిలిచిన రీ టెండర్లలో గతంకంటే రూ.54 కోట్లు తక్కువకే బిడ్లు వచ్చాయని మంత్రి పొంగులేటి వివరించారు.కేటీఆర్ వ్యాఖ్యలపై పరువునష్టం దావా వేస్తామన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## కొనసాగుతున్న హైడ్రా కూల్చివేతలు

**కోకాపేటలో అక్రమ కట్టడాల కూల్చివేత**

**హైదరాబాద్,సెప్టెంబర్21:** హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. నగర శివారులోని నార్సింగి మున్సిపాలిటీలో గండిపేట మండల రెవెన్యూ అధికారులు, నార్సింగి మున్సిపాలిటీ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించారు. కోకాపేట్‌లో సర్వే నంబర్ 147లో కొందరు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా నిర్మించారు. దీంతో అధికారులు జేసీబీల సహాయంతో అక్రమ నిర్మాణాల కూల్చివేత చేపట్టారు. మరోపక్క నార్సింగి మున్సిపాలిటీలోని అక్రమంగా నిర్మించిన భవనాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. భవనానికి జి ప్లస్ 2 అనుమతులు తీసుకున్న వ్యక్తి జి ప్లస్ 5 నిర్మాణం చేపట్టాడు. అంటే 3 అంతస్తులు అదనంగా నిర్మించాడు. దీంతో భారీబందోబస్తు నడుమ అక్రమ నిర్మాణాలను కూల్చివేశామని గండిపేట్ తహసీల్దారు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మరోవైపు బాధితులు మాత్రం అన్ని అనుమతులు తీసుకున్న తర్వాత డోర్ నంబర్,విద్యుత్ మీటర్లు పొందామని ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టు పక్కల పెద్ద పెద్ద భవనాలు నిర్మాణం చేపట్టినా వాటిని కూల్చివేయకుండా నిరుపేదలైన తమ ఇళ్లను మాత్రమే కూల్చివేశారంటూ బాధితులు ఆందోళనకు దిగారు.

# ప్రజల విశ్వాసానికి తూట్లు

**తిరుమల లడ్డూ కల్తీపై కిషన్ రెడ్డి**



**హైదరాబాద్,సెప్టెంబర్21:** కలియుగ ప్రత్యక్ష దైవం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల కొంగు బంగారం తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న సమాచారం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షులు కిషన్ రెడ్డి అన్నారు. ఈమేరకు కిషన్ రెడ్డి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏటా కోట్లాది మంది దర్శించుకునే తిరుపతి వెంకన్న లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడం అనేది ప్రజల విశ్వాసానికి తూట్లు పొడవడమేనని అన్నారు. హిందువులు ముఖ్యంగా శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆరోపించారు. ఇది క్షమార్హం ఎంత మాత్రం కాదని చెప్పారు. కోట్లాది మంది మనోభావాలను దెబ్బతీసిన నేరస్థులకు తగిన శిక్ష పడాలని హెచ్చరించారు. ఈ దిశగా పోలీసు యంత్రాంగం, దర్యాప్తు సంస్థలు ముందుకు వెళ్తున్నాయని ఆశిస్తున్నానని అన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, దేశవిదేశాల నుంచి నిత్యం లక్షలాది భక్తులు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారని అన్నారు. పరమ పవిత్రమైన, ఎంతో ప్రశస్తమైన లడ్డూ ప్రసాదాన్ని సేవిస్తారని అన్నారు. అప్పుడే తమ దైవ దర్శనం పూర్తయిందని భక్తులు భావిస్తారని అన్నారు. ఇంత పవిత్రంగా భావించే ఈ లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వులను, చేపనూనెలను వినియోగించడం క్షమించరాని నేరమని అన్నారు. ఇలాంటి దురాగతానికి బాధ్యులైన వారందరినీ గుర్తించి, తగిన శిక్ష పడేలా చేయాలని అన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఘటనలేవీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు. దీంతో పాటు తిరుపతిలో అన్య మత ప్రచారం, తిరుమల కొండపైకి మద్యం, మాంసాహారాన్ని తీసుకెళ్లడం, టీటీడీలో అవినీతి అక్రమాలు గత కొన్నేళ్లుగా పతాక శీర్షికలవుతున్నాయని ఆరోపించారు.

**హరీష్ రావును కాకుండా అరికెపూడిని**

## ఎలా నియమిస్తారు

**పిఎసి చైర్మన్‌ను ఎన్నుకున్నారా..ఎంపిక చేశారా**

**స్పీకర్‌ను సూటిగానే ప్రశ్నించామన్న వేముల, గంగుల**

**హైదరాబాద్,సెప్టెంబర్21:** ప్రతిపక్ష పార్టీలకు దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీని కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. పీఏసీ సమావేశానికి వచ్చాం.. కానీ మీటింగ్ ప్రారంభంలోనే పీఏసీ నియామకంపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అడిగామని తెలిపారు. కమిటీని ఎన్నుకున్నారా.. సెలక్షన్ చేశారా అని అడిగామన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి , గంగుల కమలాకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ...రూల్ 250 ప్రకారం పీఏసీ కమిటీని ఎన్నుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలం కోరామని అన్నారు. అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ పేర్లు, మండలి నుంచి ఎల్ రమణ, సత్యవతి రాథోడ్ పేర్లు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఇచ్చామని చెప్పారు. కానీ హరీష్‌రావు పేరు లేకుండా అరికపూడి గాంధీ ఎలా వచ్చిందని ప్రశ్నించారు.పీఏసీ చైర్మన్‌ను ప్రతిపక్ష పార్టీ నియమిస్తుందని గుర్తుచేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు పీఏసీ చైర్మన్‌గా ప్రతిపక్ష పార్టీలకే పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చినట్లు గుర్తుచేశారు. గతంలో కూడా ప్రతిపక్ష పార్టీలోఉన్న నేతలే పీఏసీ చైర్మన్లు అయ్యారని వివరించారు. కేంద్రంలో కూడా ఇదే ఫార్ములా ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలకే పీఏసీ చైర్మన్‌గా చేశారని అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సూచన మేరకే లోక్‌సభలో కేసీ వేణుగోపాల్ పీఏసీ చైర్మన్ అయ్యారని గుర్తుచేశారు.÷ఖఏసీ నియామకంపై స్పీకర్‌ను అడిగితే ఆయన ఒక్కమాట కూడా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అన్నింటికీ మంత్రి శ్రీధర్ బాబు సమాధానం ఎలా చెబుతారని నిలదీశారు. పీఏసీ నియామకంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసి నిరసన తెలిపామని చెప్పారు. తెలంగాణ ప్రజలు, మేధావులు కాంగ్రెస్ ప్రభుత్వం గురించి ఆలోచించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పీఏసీ చైర్మన్ కోసం నామినేషన్ వేయలేదని.. ఆయనను ఎలా చైర్మన్‌గా నియమిస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రశ్నించారు. హరీష్ రావును ఎందుకు లిస్ట్‌లో లేకుండా చేశారని నిలదీశారు. హరీష్ రావు అంటే అధికార పార్టీకి భయమా అని అడిగారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీల పేర్లు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఇచ్చామని గుర్తుచేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చాలా కీలకమని చెప్పారు. తాము అన్ని గమనిస్తామన్నారు. ఈ విషయంపై తెలంగాణ హై కోర్టును కూడా ఆశ్రయిస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ స్పీకర్‌ను కలుద్దామని చూస్తే ఆయన వెళ్లిపోయారని అన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఓడిపోయిన కాంగ్రెస్ నేతలకు కూడా నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ప్రోటోకాల్ పాటించడం లేదని ప్రశ్నించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేల హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శలు చేశారు.

# అసంబద్ధమైన టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులు ఉపసంహరించాలి

**- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చుంచు శ్రీశైలం - ఐదు తరగతుల్లో 60 మంది పిల్లలతో 18 సబ్జెక్టులకు ఇద్దరే టీచర్లా ?**

**- కాలం చెల్లిన రేషనలైజేషన్ నిబంధనలు సవరించాలి - పేదల బడుల మూసివేతకు నడుం కట్టిన ప్రభుత్వం**




**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 21:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట టీచర్లు తక్కువగా, టీచర్లు ఎక్కువగా ఉన్న చోట పిల్లలు తక్కువగా ఉన్నారని దీనిని సర్దుబాటు చేయాలనే పేరుతో విద్యాశాఖ జిల్లా కలెక్టర్లకు ఇచ్చిన ఆదేశాలు అసంబద్ధంగా ఉన్నాయని, ఉన్న విద్యార్థులు కూడా వెళ్లిపోయేలా చేసి బడుల మూసివేతకు దోహదం చేసేలా ఉన్న ఆ ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చుంచు శ్రీశైలం డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అత్యవసరంగా నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో శ్రీశైలం మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో 11 మంది పిల్లలున్న చోట ఇద్దరు ఉపాధ్యాయులు, 60 మంది ఉన్న చోట కూడా ఇద్దరే ఉపాధ్యాయులను ఉంచాలని ఆదేశించడం ఎంత అసంబద్ధంగా ఉందో విద్యా శాఖ అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. ఐదు తరగతులకు పద్దెనిమిది సబ్జెక్టులను ఇద్దరు ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులను పూర్తిగా దూరం చేసేలా ఈ నిబంధనలు ఉన్నాయని అన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో 40 మంది పిల్లలు దాటితే ముగ్గురు టీచర్లను ఇచ్చి ఇప్పుడు తీయడం ఎందుకో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎనిమిదేళ్ల క్రితం రూపొందించిన కాలం చెల్లిన నిబంధనలనే ఇప్పటికీ అమలు చేయజూడడం సరికాదని అన్నారు. ఈ నిబంధనలు యధావిధిగా అమలు చేస్తే ఉన్నత పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులపై మోయలేని భారం పడుతుందని, ఇది విద్యా ప్రమాణాలపై, ఫలితాలపై ప్రభావం చూపుతుందని అన్నారు. అసంబద్ధంగా ఉన్న సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు. మూసివేసిన బడులను తెరిపిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఉన్న బడులను మూసివేసే విధానాలను అమలు చేస్తున్నారని, చెప్తున్న మాటలకు చేస్తున్న పనులకు పొంతన ఉండాలని ఉపాధ్యాయులు భావిస్తున్నారని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో యాకయ్య, శ్రీనివాస్, పద్మావతి, మధుసూదన్, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

## జయ్యారం శివారు మంగోరి గూడెం 153సర్వే నంబర్

# భారీ జేసీబీలతో బోళ్ళు ఏనెలను తోడేస్తున్నారు

**- భారీ గోతులు తవ్వి,తొవ్విన బండరాళ్ళతో నింపి చదునుచేస్తున్నారు**

**- అక్కడ రిజిస్ట్రేషన్ ఉన్న భూములకు ఆనుకొన్న ఏనెలు, ఫారెస్ట్ భూములు స్వాహా..**

**- ఇటీవల వరదలతో ఈ ప్రాంతం ఉక్కిరి బిక్కిరి..**







**తొలి సమయం డోర్నకల్ సెప్టెంబర్ 21:** రిజిస్ట్రేషన్ భూములకు ఆనుకొని ఉన్న వ్యవసాయానికి యోగ్యత లేని బోళ్ళు ఈనెలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు టార్గెట్ చేస్తున్నారు.. గ్రామాల్లోని రైతులను ముందు పెడుతూ వ్యవసాయ యోగ్యం గాని భూముల్లో వాగులు వంపులు. బొందలను భారీ జెసిబి లతో అత్యాధునిక సరళ యంత్రాలతో బోళ్లను ఏ నెలను తవ్విన పెద్ద పెద్ద బండరాళ్లతో నింపేస్తున్నారు.. రిజిస్ట్రేషన్ భూములంటూ.. మా భూమిని మేము చదును చేసుకుంటున్నాము. అని సమాధానాలు ఇస్తున్నారు.. ఏళ్ల తరబడి ఉన్న బోళ్ళు ఏనెలను తొవ్వేస్తున్నారు.. అధికారులు అంటే లెక్కలేని తనం కొట్టొస్తోంది. పేరుకి వ్యవసాయమా! లేక రియల్ వ్యాపారుల స్వార్థ ప్రయోజనాల కోసం రైతులను బలి పెడుతున్నారా! అని అనుమానాలకు తావిస్తోంది.. రకరకాల జీవ వైవిధ్యంతో పశువులు గొర్రెలు మేకలు మేయడానికి అనువుగా ఉన్న కంచలు, బంజరు భూములుగా ఉండే పర్యావరణ పరిసరాలను కబలిస్తున్నారు.. ఇటీవల డోర్నకల్ నియోజకవర్గంలో వరదలు తాండవం చేశాయి, ఆ విశాదం తాలూకు తడి ఆరకముందే.. మళ్లీ రియల్ వ్యాపారులు యధావిధిగా పంజా విసురుతూనే ఉన్నారు.. పర్యావరణాన్ని చర పడుతూనే ఉన్నారు. వివరాల్లోకి వెళితే... 153 సర్వేనెంబర్ జయ్యారం శివారు మంగోరి గూడెం దగ్గర ఈ భారీ తవ్వకాలు జరుగుతున్నాయి.. దీంట్లో కొంత ఫారెస్ట్ భూమి కూడా ఉన్నట్టుగా అనుమానాలకు తావిస్తోంది.. వ్యవసాయ అవసరానికి రైతులు చేసుకుంటున్న చదును అయితే బాగానే ఉంటుంది.. కానీ వ్యవసాయం పేరుతో రైతుల బూములను చౌకబారుగా కొని అక్కడ ఉన్న రిజిస్ట్రేషన్ భూమికి బోళ్ళు యేనెలు మరియు ఫారెస్ట్ భూమిని కలుపు కుంటున్నారనే ప్రచారంగా బలంగా సాగుతోంది. కనుక వెంటనే రెవిన్యూ, ఇరిగేషన్, మైనింగ్ ఫారెస్ట్ అధికారులు స్పందించి, ప్రభత్వభూమి, ఫారెస్ట్ భూములు ఉన్నట్లు అయితే వెంటనే జేసీబీ లు భారీ సరళ యంత్రాలను అదుపులోనికి తీసుకొని..తగిన చర్యలు తీసుకోవాలి పర్యావరణ ప్రేమికులు కోరుకుంటున్నారు.



# ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ ధ్యేయం

**పిఆర్టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు సంకాబద్రి నారాయణ**




**తొలి సమయం, మహబూబాబాద్ సెప్టెంబర్ 21:** ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పిఆర్టియుటిఎస్ పనిచేస్తుందని పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా శాఖ అధ్యక్షులు సంక బద్రి నారాయణ అన్నారు. మహబూబాబాద్ లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మహబూబాబాద్ మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత 52 సంవత్సరాల నుండి ఉపాధ్యాయుల అనేక సమస్యలను పిఆర్టియు పరిష్కరించినదని,కౌన్సిలింగ్ విధానాన్ని తీసుకొచ్చి ఉపాధ్యాయులకు అనుకూలమైనటువంటి ప్రదేశాలకు వెళ్లేలా, అప్రెంటిస్ వ్యవస్థ రద్దు, చైల్డ్ కేర్ లీవులు, ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయపోస్టులు, ప్రాథమిక పాఠశాలకు ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయ పోస్టులు, ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్,ఫిజికల్ సైన్స్, మరియు పండిట్ల అప్గ్రేడేషన్ ,వంటి ఎన్నో జటిలమైన సమస్యలను పిఆర్టియు ప్రభుత్వానికి విన్నవించి పరిష్కరించిందని రాబోయే కాలంలో మంచి 50% ఫిట్మెంట్తో పిఆర్సి వచ్చే విధంగా కృషి చేస్తామని, ప్రభుత్వ హామీ ఇచ్చిన మేరకు సిపిఎస్ వ్యవస్థను రద్దు చేసి ఓ పి ఎస్ ను ప్రవేశపెట్టేలా ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని, పెండింగ్లో ఉన్న ఐదు డిఏలు రావడానికి కృషి చేస్తామని, ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి ఎంఈఓ ,డైట్ లెక్చరర్ వంటి పదోన్నతులు వచ్చేలా ప్రయత్నం చేస్తామని, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు ,కేజీబీవీ ఉపాధ్యాయులకు, ఎంఆర్సి సిబ్బందికి ,మినిమం టైం స్కేల్ ఇప్పిస్తామని ఆయన అన్నారు. అదేవిధంగా వివిధ సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్నటువంటి గురుకుల పాఠశాల ఉపాధ్యాయులకు మరియు మోడల్ స్కూల్ సిబ్బందికి హెల్త్ కార్డులు వచ్చేలా కృషి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ మండల శాఖకు నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మహబూబాబాద్ మండల శాఖ అధ్యక్షులుగాలి భూక్యా రామోజీ నాయక్ , ప్రధాన కార్యదర్శిగా కాపరబోయిన సుజాత , అసోసియేట్ అద్యక్షులుగా కే నాగరాజు , ఉపాధ్యక్షులుగా బి విజయ్ ,బి కౌసల్య , కార్యదర్శులుగా వి.మధు ఓ.సుశీల ఎన్నికయ్యారు . ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్ రెడ్డి మండల శాఖ మాజీ అధ్యక్షులు కళ్ళెం వెంకట్ రెడ్డి ,రాష్ట్ర బాధ్యులు టీ మురళీధర స్వామి, బి గీత,వై ఉమాదేవి, జి హల్యా నాయక్, పి.విజయ్ కుమార్,కే. కనకయ్య, మహమూద్ అలీ , వి .శ్యామలా దేవి , వై.గాయత్రి,పల్లా వెంకన్న, ఎన్నికల అధికారులుగా శ్రీధర్, సీతారాములు వ్యవహరించారు..మరియు జిల్లా బాధ్యులు శంకర్ ,అశోక్, లక్ష్మా రెడ్డి,భోజన్ , సంగీత, భవాని, అనిత,వాణి సత్యనారాయణ రెడ్డి, హేమన్ రెడ్డి మరియు ఇతర మండలాల బాధ్యులు పాల్గొన్నారు.



భూక్యా రాంమోజి నాయక్



కాపరబోయిన సుజాత

# ఎమ్మెల్యే పేరు వాడుకోవద్దు

**ఇసుక అక్రమ దందాపై తక్కలపల్లి రాజు ఫైర్**



**తొలి సమయం భూపాలపల్లి సెప్టెంబర్ 21 :** ఇసుక అక్రమ దందా చేసేవారు భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పేరును వాడుకొని చెడ్డపేరు తేవోద్దని..అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కలపల్లి రాజు అధికారులను కోరారు. శనివారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో ఇసుక మాఫియా ముఠాగా ఏర్పడిన కొందరు వ్యక్తులు అధికారులను, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఎమ్మెల్యే పేరును వాడుకుంటూ..ఆయనకు చెడ్డ పేరు తేవడానికి కొందరు వ్యక్తులు కుట్రలు పన్నుతున్నారని రాజు మండిపడ్డారు. అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకొని ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులపై, ప్రజలపై ఉందన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వాగుల సమీపంలోని గ్రామాల ప్రజలు ఇల్లు కట్టుకునేందుకు మాత్రమే పర్మిషన్ ఇవ్వాలని అధికారులను కోరారని, కానీ ఎమ్మెల్యేకు చెడ్డపేరు తేవాలనే సంకల్పంతో ప్రతిపక్ష నాయకులు కొందరు వ్యక్తులతో ఇసుక మాఫియా ముఠాను ఏర్పాటు చేయించి..రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా ఇసుకను అక్రమంగా బయటకు తరలిస్తూ..సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఈ తతంగాన్నంతా ప్రజలు గమనించాలని, ఇసుక అక్రమ రవాణా దారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. ఇప్పటికైనా ఇసుక మాఫియా ముఠాపై కన్నేసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేరు చెబుతున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే కు చెడ్డ పేరు తెచ్చే విధంగా వ్యవహరించే ఎవరినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.

# నా భర్తతో ప్రాణహాని ఉంది

**- అనునిత్యం వేధింపులే...**

**- ఎమ్మెల్యే కు మహిళ మొర...**

**- స్పందించిన ఎమ్మెల్యే..**

**- తక్షణమే చర్యలు తీసుకోవాలని సిఐ ఎమ్మెల్యే ఆదేశం**



**బయ్యారం,తొలి సమయం,సెప్టెంబర్ 21** ఇల్లందు కోరం కనకయ్య బయ్యారం మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. పర్యటనలో బాగంగా శనివారం మండల కేంద్రంలో రైతు సహకార సంఘ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశంలో మాటమంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇర్సులాపురం గ్రామానికి చెందిన బయ్య మౌనిక భర్త తనను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ,పిల్లలను పట్టించుకోకుండా తిరుగుతున్నాడని,తన భర్త నుండి వేరుగా ఉంటూ పిల్లలను పోషించుకుంటున్నా వేధింపులు తప్పడం లేదని,నా భర్త తో నాకు ప్రాణహాని ఉందని,అతనిని చట్టపరంగా చర్య తీసుకోవాలని కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి మహిళ భర్త పై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అదే విదంగా మండలంలో రైతుల రుణ మాఫి అయిన రైతులు గతంలో, ఆర్ ఓ ఎఫ్ ఆర్ పహానిల పై రుణం పొంది మాఫి కానీ రైతుల విషయంలో వారి సాగు భూములకు ధరణి పట్టా,ఆర్ ఓ ఆర్ పాస్ బుక్ లు రాకపోవడంతో బ్యాంక్ లో ఉన్న రుణం మాఫీ కాక ,కొత్త రుణం అందడంలేదని కస్తూరి నగరం మహిళా రైతు ఎమ్మెల్యే ఎదుట తన గోడును వెళ్ల బోసుకుంది. ఎమ్మెల్యే దీనిపై క్యాబినెట్ లో ప్రస్థావించి బయ్యారం మండల రైతులకు న్యాయం చేస్థామని హామి ఇచ్చారు. తులారం కాలువ గండ్లు పడ్డాయాని వాటిని పునరుద్ధరణ చేసి రైతులకు సాగు నీరు అందించాలని గౌరారం,వినోభనగర్ రైతులు ఎమ్మెల్యే ను కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మూల మధూకర్ రెడ్డి,సీఐ రవి కుమార్,కంబాల ముసలయ్య, వెంకట పతి,నర్సయ్య,రాకేష్,,తొట్టి కృష్ణ,మండల పోడు రైతులు వారితో ఉన్నారు.

# కల్తీ నెయ్యితో తిరుమల అపవిత్రం

**ఆలయ సంప్రోక్షణకు టిటిడి నిర్ణయం**

**23 నుంచి 25 వరకు శాంతియాగం నిర్వహణ**

**తిరుమల,సెప్టెంబర్21:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరుడి మహా ప్రసాదమైన లడ్డూలో కల్తీ నెయ్యి వాడిన నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఆలయాన్ని సంప్రోక్షణ చేయాలని ఇప్పటికే నిర్ణయించిన టీటీడీ ఆ క్రతువులో భాగంగా తొలుత మహా శాంతి యాగాన్ని నిర్వహించాలని శనివారం నిర్ణయించింది. మూడు రోజులపాటు ఈ క్రతువు నిర్వహించ నున్నారు. సెప్టెంబర్ 23 నుంచి 25 వరకు శాంతియాగాన్ని జరపనున్నారు. వేదపండితులు, రుత్వికుల నడుమ శ్రీ వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. తిరుమల శ్రీవారి వారి లడ్డూలో వాడకూడని పదార్థాలను వినియోగించిన నేపథ్యంలో లడ్డూలు తయారు చేసే పోటుతో పాటు, నెయ్యి భద్రపరిచిన ప్రదేశాలను సంప్రోక్షణ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. టీటీడీ ఈవో, అధికారులతో శుక్రవారం రెండుసార్లు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి ముందు.. గత వైసీపీ హయాంలో శ్రీవారి లడ్డూ తయారీలో నాణ్యతా లోపాలు, అపవిత్ర పదార్థాల వాడకంపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. లడ్డూ తయారీ విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని టీటీడీ ఈవో శ్యామలరావును సీఎం ఆదేశించారు. తిరుమల పవిత్రత కాపాడే విషయంలో ఆగమ, వైదిక, ధార్మిక పరిషత్‌లతో చర్చలు జరుపుతామని ప్రకటించారు. భక్తుల విశ్వాసాలను, ఆలయ సాంప్రదాయాలను కాపాడతామని హామీ ఇచ్చారు. తిరుమల సంప్రోక్షణకు సంబంధించిన విధివిధానాలు తెలియజేసేలా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం దృష్టి పెట్టింది.

# గ్రీన్‌కార్డు హోల్డర్లకు శుభవార్త

**36 నెలలకు వ్యాలిడిటీ పొడిగింపు**

**వాషింగ్టన్,సెప్టెంబర్21:** అమెరికాలో శాశ్వత నివాసం పొందుతున్న గ్రీన్‌కార్డుదారులకు అక్కడి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ పర్మనెంట్ రెసిడెంట్ కార్డుల వ్యాలిడిటీ కాలాన్ని మరింత పొడిగించింది. గతంలో గ్రీన్‌కార్డు గడువు తీరినప్పటికీ .. మరో 24 నెలల పాటు దాని వ్యాలిడిటీ పొడిగించేవారు. ఇప్పుడు దీన్ని 36 నెలలకు పెంచినట్లు అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ వెల్లడించింది. దీంతో గ్రీన్‌కార్డు రెన్యువల్ కోసం ప్రయత్నిస్తున్న వారికి ఊరట లభించినట్లైంది. సాధారణంగా అమెరికాలో గ్రీన్‌కార్డులు పొందినవారు ప్రతీ పదేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలి. ఇందుకోసం కార్డు గడువు తీరిపోయే కాలానికి ఆరు నెలల ముందే ఐ-90 ఫామ్‌ను సమర్పించాలి. రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి కార్డు వ్యాలిడిటీని 24 నెలలు పొడిగిస్తూ రిసీట్ నోటీసు ఇస్తారు. దీంతో గ్రీన్‌కార్డు గడువు తీరిపోయినా.. ఈ నోటీసుతో వారికి చట్టబద్ధమైన నివాస హోదా కొనసాగుతుంది. కొత్త కార్డు జారీ అయ్యే వరకు ఉద్యోగాలు, ప్రయాణాల సమయంలో వారు దాన్ని లీగల్ స్టేటస్ ప్రూఫ్‌గా వినియోగించుకోవచ్చు.

# పశు బీమా అమలు ఏదీ...?

**- ఆరేళ్లుగా నిలిచిన పథకం - పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం - పథకాన్ని పునరుద్ధరించాలని పశుపోషకులు వినతి**

**జగిత్యాల :** పశు బీమా పథకం అమలు కాకపోవడంతో పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జి ల్లాలో వ్యవసాయం తరువాత రైతులు ఎక్కువగా పాడి పరిశ్రమపైనే ఆ ధారపడి జీవిస్తున్నారు. పాడి పశువుల కొనుగోలుకు కొన్ని సార్లు రూ. లక్ష రూపాయలు కూడా వెచ్చిస్తుంటారు. పాల దిగుబడిని బట్టి పశువు ధర ఉంటుంది. పశువులను సొంత బిడ్డల్లా చూసుకుంటూ దాని ఆసరాగా చే సుకొని జీవిస్తుంటారు. రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించే వ్యవసా య అనుబంధ రంగాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. రైతులు వ్య వసాయంతో పాటు పాడి పరిశ్రమలను కొనసాగిస్తే ఆర్థికంగా ఆసరాగా ఉంటుంది. ప్రభుత్వం రైతులకు చేయూతనందిస్తామని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. ఆరేళ్లుగా పశు బీమా నిలిపివే యడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పాడి పశువు లకు రైతు వాటా ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం కొంత నగదును కలిపి బీమా సౌకర్యం కల్పించేది. దీంతో పశువులు మృత్యువాత పడినా వచ్చిన బీమా డబ్బులతో రైతులు మళ్లీ పశువులను కొనుగోలు చేసుకొని భరోసా గా ఉండేవారు. పథకం నిలిచి పోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.



**ఆరేళ్లుగా అమలు కాని పథకం...**

పాడి పశువుల బీమా పథకం 2017-18 వరకు ప్రభుత్వం అమలు చే సింది. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరేళ్లుగా ఈ పథకం గురిం చి పట్టించుకోవడం లేదు. గ్రామీణ ప్రాంతాలలో రైతులు ఆర్థికంగా ఎది గేందుకు పాడి పరిశ్రమ ఎంత గానో దోహదపడుతుంది. పశువులు రోడ్డు, విద్యుత్ ప్రమాదాలు, అనారోగ్యం కారణంగా మృత్యువాత పడుతున్నాయి. మేలు జాతి పాడి పశువులకు లక్షల్లో డిమాండ్ ఉంది. అనివార్య కారణా లతో పశువులు మృతి చెందితే రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయి అప్పుల్లో కూరుకుపోతున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు, పిడుగు పాటు గురై పలు పశువులు మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం భీమా పథకాన్ని పునరుద్దరించి ఆదుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

**ప్రభుత్వం అందించిన పశువులకే భీమా...**

గత రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్దిదారులకు అందించిన పశువులకు మాత్రమే భీమా సౌకర్యం కల్పించింది.


ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యూనిట్ ధరలోనే పశు వులకు భీమా ప్రీమియం చేల్లిస్తున్నానరు. దీంతో ప్రభుత్వం పంపిణీ చేసిన పశువులకు బీమా సౌకర్యం ఉండి రైతులు కొనుగోలు చేసుకున్న పశువు లకు మాత్రం బీమా సౌకర్యం కల్పించకపోవడం సరికాదని రైతులు వాపోతున్నారు. ప్రై వేటు బీమా కంపెనీలను ఆశ్రయించి పశువులకు బీమా చేయించాలంటే సుమారు లక్ష రూపాయలు ఉన్న పశువుకు రూ. 7 నుంచి రూ. 8 వేల ఖర్చు అవుతున్న పరిస్థితి నెలకొనడంతో పాడి రైతులు ఆర్థిక ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు.


**1.24 లక్షల గేదెలు, 47,405 ఆవులు..**

జిల్లా వ్యాప్తంగా గేదెలు 1,24,248 ఉండగా, 47,405 ఆవులు, 6,10,985 గొర్రెలు, 97,033 మేకలు, 14,895 పందులు, కుక్కలు 3,310, ఫౌల్ట్రీ 8,27,595 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్ర మపై ఆధారపడి జీవిస్తున్నారు. పాల వ్యాపారంతో కుటుంబ పోషణ సాగిస్తున్నారు.

# చరిత్ర ఘనం.. శిథిల జ్ఞాపకం

- ములుగు మండలం కొత్తూరు దేవునిగుట్టపై ఉన్న పురాతన ఆలయం
- ములుగు మండలం కొత్తూరు దేవునిగుట్టపై పురాతన ఆలయం
- ఆంగ్‌కోర్ వాట్ తరహా నిర్మాణ శైలి
- 1500ఏళ్లనాటిదిగా భావిస్తున్న పురావస్తు పరిశోధకులు
- ఆలయ పునరుద్ధరణ విషయంలో జాప్యం
- రెండేళ్లక్రితం కలెక్టర్ నిధుల నుంచి రూ.1.80కోట్ల కేటాయింపు
- టెండర్ దశలోనే నిలిచిన పనులు
- 'ఫారెస్టు' టూరిజానికి మొదటి అడుగు
- రాళ్లతో మెట్ల మార్గాన్ని నిర్మిస్తున్న అటవీశాఖ
- ట్రెక్కింగ్, క్యాంప్ ఫైర్ నిర్వహణకు సన్నాహాలు





**ములుగు :** ములుగు అభయారణ్య గర్భం వందల ఏళ్ల చరిత్రను పదిలంగా దాచుకుంది. ఎక్కడ తడిమి చూసినా.. తవ్వి శోధించినా అడుగడుగునా విస్తుగొలిపే వింతలు, విశేషాలే కనిపిస్తాయి. ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపుతో కీర్తిపొందిన రామప్ప దేవాలయం కంటే పురాతనమైన చరిత్ర సాక్ష్యాలు అనేకం శిథిల జ్ఞాపకాలుగా ఉన్నాయి. తాడ్వాయి మండలంలోని దామెరవాయి, మంగపేట మండలంలోని మల్లూరు అడవుల్లో వెలుగుచూసిన డోల్మన్ సమాధులు ఆదిమ మానవుడి ఆనవాళ్లకు దారి చూపిస్తాయి. ఇదే తరహాలో అత్యంత విశిష్టమైన రాతి నిర్మాణమొకటి ములుగు మండలం కొత్తూరు సమీపంలోని దేవునిగుట్టపై ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ దేవాలయంగా ప్రసిద్ధిగాంచిన కంబోడియాలోని ఆంగ్‌కోర్ వాట్ నిర్మాణ శైలిలో ఉండే ఈ ఆలయం ప్రస్తుతం శిథిలావస్థలో దర్శనమిస్తోంది. నాలుగు దశాబ్దాలుగా ఈ కట్టడంపై విస్తృత పరిశోధనలు జరుగుతుండగా పరిరక్షణ, పునరుద్ధరణకు అడుగులు ముందుకు సాగడంలేదు. తాజాగా అటవీశాఖ ఆధ్వర్యంలో గుట్టపైకి మెట్ల మార్గాన్ని నిర్మిస్తుండటం ఈ ఆలయ మనుగడపై ఆశలు పెంచుతోంది.

**ఆరో శతాబ్దం నాటి నిర్మాణం..**

ములుగు జిల్లాకేంద్రానికి 18కిలోమీటర్ల దూరంలోని కొత్తూరు గ్రామ శివారులోగల దేవునిగుట్టపై ఈ రాతి నిర్మాణం ఉంది. వందేళ్లక్రితమే ఈ ఆలయం వెలుగులోకి వచ్చినా చుట్టూ ఉన్న దట్టమైన అడవిలో క్రూరమృగాల సంచారం ఎక్కువగా ఉండటంతో ప్రజలెవరూ అటువైపునకు వెళ్లేవారు కాదు. అయితే గత మూడు దశాబ్దాలుగా దీనిపై విస్తృత చర్చ జరుగుతోంది. గత పదేళ్ల కాలంలో దేశ విదేశాలకు చెందిన పురావస్తు, చరిత్ర పరిశోధకులు వచ్చివెళ్లారు. చూసిన వారంతా ఒకింత సంభ్రమాశ్చర్యానికి లోనయ్యారు. ఆంగ్‌కోర్ వాట్ ఆలయం నమూనాలో ఉండటాన్ని గుర్తించి.. 6, 7శతాబ్దాల కాలంలో నిర్మించి ఉంటారని, విష్ణుకుండినుల కాలంలోని శైలిని పోలి ఉందని అభిప్రాయపడ్డారు. దక్షిణ ఆసియాలోని పురాతన కట్టడాలపై పరిశోధన చేస్తున్న బ్రిటన్‌కు చెందిన చరిత్రకారుడు ఆడమ్ హార్డీ, జర్మనీకి చెందిన కొరీనా, ఇటలీకి చెందిన ఆండ్రీతోపాటు దేశీయ పరిశోధకులు అనేకమంది దేవునిగుట్ట ఆలయాన్ని సందర్శించి చరిత్ర లోతుల్లో అన్వేషించారు. యావత్ భారత దేశంలోనే ఇలాంటి నిర్మాణం ఎక్కడాలేదని తేల్చిచెప్పారు. ఫొటోలు, వీడియోలు తీసుకొని వెళ్లి ఇంకా అధ్యయనం జరుపుతూనే ఉన్నారు.

**శిథిలావస్థలో ఆలయం**

దేవునిగుట్ట ఆలయం నిర్మాణం చూడగానే మనసును కట్టి పడేస్తుంది. ఆ శైలి ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోంది. 30మీటర్ల ఎత్తులో ఉండే ఈ ఆలయం రాతి ఇటుకలను పేర్చినట్లు కనిపిస్తుంది. శైవం, వైష్ణవం కలబోతగా శిల్పాకృతులున్నాయి. తాండవం చేస్తున్నట్లుగా పరమశివుడు, నిలువెత్తు విష్ణుమూర్తి, దేవతల ఆకృతులు కనిపిస్తాయి. అనేక రాళ్లపై దేవతామూర్తుల రూపాన్ని చెక్కి వరుసక్రమంలో పేర్చిన తీరు ఆనాటి మేధస్సుకు అద్దం పడుతోంది. కాలక్రమంలో ఆలయం శిథిలావస్థకు చేరగా.. గోపురం పైభాగం ధ్వంసమై వర్షపునీరు లోపలికి చేరుతోంది. చెట్లు పెరగడం, తీగలు అల్లుకోవడంతో రాళ్లమధ్య పగుళ్లు వచ్చాయి. 60నుంచి 70ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రహరీ ధ్వంసమైంది. ఆలయానికి వెళ్లే మార్గంలో గండశిలపై ఉన్న కోనేరు కాలాలతో సంబంధం లేకుండా ఎప్పుడూ నీటితో నిండి ఉంటుంది. ఇదిలా ఉంటే గుప్తనిధుల కోసం ఇక్కడ అన్వేషణ సాగుతోంది. గతంలో అనేక మంది రహస్యంగా తవ్వకాలు జరిపినట్టు స్థానికులు చెబుతారు. అయితే ఇటీవల ఆలయానికి సందర్శకులు వస్తుండటం, జనసంచారం పెరుగుతుండటంతో కొంతమేరకు తగ్గుముఖం పట్టినట్టు స్పష్టమవుతోంది.

**సంరక్షిస్తున్న స్థానికులు**

కొత్తూరు గ్రామస్థుల ఆరాధ్య దైవమైన లక్ష్మీనర్సింహస్వామి తమను ప్రకృతి విపత్తులు, వైపరీత్యాల నుంచి కాపాడుతున్నాడని నమ్ముతున్నారు. దేవునిగుట్టపై సాక్షాత్తు నర్సింహస్వామియే కొలువున్నాడనే విశ్వాసంతో వారు 2012లో దేవుని విగ్రహాన్ని ప్రతిష్టించుకొని ఏటా హోలీ సమయంలో వేడుకలు జరుపుతూ లక్ష్మీనర్సింహస్వామికి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చి దేవున్ని దర్శించుకుంటారు. ఈక్రమంలో భక్తులు వింత ఆచారాన్ని పాటిస్తున్నారు. వర్షాలు కురవాలని, అంటువ్యాధులు దూరం కావాలని వేడుకుంటూ వరదపాశం వేడుక నిర్వహిస్తున్నారు. బెల్లం, బియ్యం, పాలతో వండిన పరమాన్నాన్ని ఆలయం ఎదుట బండరాయిపై పోసి నాకుతారు. ఇలా ఇన్నేళ్లుగా కొత్తూరువాసులు ఈ పురాతన కట్టడాన్ని సంరక్షిస్తున్నారు. గుడి వద్దకు వెళ్లాలంటే కాలినడకన దట్టమైన తుప్పలు, చెట్లను దాటాలి. ప్రతీ ఏటా ఉత్సవాల సమయంలో అప్పటికప్పుడు ముళ్లపొదలు, తుప్పలను కొంతమేరకు తొలగించి తాత్కాలిక దారిని ఏర్పాటు చేసుకుంటారు.

**రూ.10లక్షలతో మెట్లు, బేంచీలు..**

ఆలయ పునరుద్ధరణ కోసం రెండేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ కృష్ణఆదిత్య రూ.1.80కోట్లను కేటాయించారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు, తెలంగాణ పురావస్తు శాఖ సంయుక్త పర్యవేక్షణలో పనులు చేయాలని నిర్ణయించారు. అయితే ఆ ప్రయత్నం టెండర్ల దశలోనే నిలిచిపోయింది. తాజాగా జిల్లా అటవీశాఖ అడుగు ముందుకు వేసింది. బొగత, లక్నవరం, తరహాలో దేవునిగుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. దారి, సదుపాయాల కల్పనకోసం రూ.10లక్షల వ్యయంతో పనులు మొదలుపెట్టారు. 2కిలోమీటర్ల మేర మెట్ల మార్గాన్ని నిర్మిస్తున్నారు. స్థానికంగా లభించే రాళ్లతోనే మెట్లను కడుతున్నారు. గుట్టపై పగోడాలు, సందర్శకులు సేదతీరేందుకు బెంచీలను ఏర్పాటు చేయనున్నట్టు ములుగు ఫారెస్టు రేంజ్ అధికారి శంకర్ తెలిపారు. వారాంతాల్లో ట్రెక్కింగ్, క్యాంప్ ఫైర్, తదితర సదుపాయాలు కూడా కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. దేవునిగుట్ట విశేషాలను పర్యాటకులకు తెలిపేందుకు గైడ్‌ను నియమిస్తామని తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత నిర్ణీత టిక్కెట్ ధరతో సందర్శనకు అనుమతించనున్నట్టు పేర్కొన్నారు.

## ప్రజల ఆకాంక్షలను గౌరవించాల్సిందే

**లేకుంటే ప్రజలే తిరగబడతారు**

**హైదరాబాద్ :** ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ సాగించడం కూడా అంతే కష్టం. ప్రజల మనసెరిగి ముందుకు సాగితే ఎంతకాలమైనా ప్రజలు ఆదరిస్తారు. కానీ నిరంకుశంగా, తమకు తిరుగు లేదన్నట్లుగా పాలించి కెసిఆర్, జగన్ పదవీచ్యుతి పొందారు. వీరి చేసిన నిర్వాకం వల్ల రాష్ట్రాలు అప్పుల్లో కూరుకు పోయారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వాలకు ఇప్పుడు అప్పులు మెడకు చుట్టుకున్నాయి. రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణను పాటించడం లేదు. దీంతో ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తూ అనుత్పాదక రంగాలకు విపరీతంగా దుబారా చేస్తున్నాయి. వీటినే అభివృద్ధి, సంక్షేమం అంటే ఓటు బ్యాంకును పటిష్టం చేసుకునే పనిలో ఉన్నాయి. ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టి కరచిపోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. ప్రధానంగా అభివృద్ధి పేరుతో చేస్తున్న డబ్బు పందేరాలు రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. ఈ అప్పులనుంచి బయటపడే మార్గాలు కూడా కనిపించడం లేదు. అలాగే అభవృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో విపక్షాలను దెబ్బతీయడం, విమర్శలను సహించకపోవడం వంటి చర్యలతో ఇద్దరు సిఎంలు నిరంకుశంగా పనిచేసారు. ఎపిలో జగన్ ప్రభుత్వం విపక్షాలను అణచివేయడం, కేసులు పెట్టడంలో ప్రత్యేక శ్రద్ద తీసుకుంది. పార్టీలను అణగదొక్కడంలో కెసిఆర్ చేసిన కృషి ఇప్పుడు ఆయనకే ఎదురు తిరిగింది. కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేయాలన్న కుట్రతో చేసిన ప్రయత్నాల వల్ల ఇప్పుడు బిజెపి సవాల్ విసిరే స్థాయికి చేరింది. కాంగ్రెస్, టిడిపిలు తెలంగాణలో ఉనికి లేకుండా పోవాలని కెసిఆర్ వేసిన ఎత్తుగడలు ఫలించాయి. ఆయన దెబ్బకు టిడిపి ఉనికిలేకుండా పోయింది. అలాగే కాంగ్రెస్ అనూహ్యంగా అధికారం చేజిక్కించుకుంది. అలాగే అనూహ్యంగా బిజెపి బలం పుంజుకుంది. దీంతో వారిని ఎదుర్కొనే క్రమంలో ఎదురుదాడి చేస్తూ బిఆర్ఎస్ కేంద్రాన్ని దుమ్మెత్తి పోసే పనిపెట్టుకున్నారు. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30 ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను,ఆకాంక్షలను పట్టించు కోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ లాంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. బిజెపి అక్కడ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారు. నిరాశా నిస్పృహలతో ఉన్న మమతా బెనర్జీ బిజెపి నేతలపై దాడులకు దిగుతోంది. ఇటీవల తమిళనాడులో కూడా స్టాలిన్ ఇదే కోవలో ప్రజలకు చేరువ అవుతున్నారు. ప్రజలను సంతృప్తి పరచేలా పాలన అందించినంతవరకు పాలక పార్టీకి దిగులు లేదు. అయితే ఇది విస్మరించి వ్యహరించడంవల్ల ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఇప్పుడు భారతీయ జనతాపార్టీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోంది. ప్రజల్లో నిరసనలు నివురుగప్పితే నాయకుడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించలేదు. ఈ కారణంగా కేసీఆర్‌కు ప్రత్యామ్నాయం కావాలనుకున్న వారికి బీజేపీనే కనిపిస్తున్నది. కమలనాథుల బలం అనూహ్యంగా పెరగడానికి ఇదే ప్రధాన కారణం. మోదీ, అమిత్‌షా నేతృత్వంలోని బీజేపీ గతంలో అద్వానీ,వాజ్‌పేయిల ఆధ్వర్యంలో ఉన్న బిజెపికి భిన్నంగా వ్యవహరిస్తోంది. భిన్నంగా దూసుకుపో తోంది. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ ముందుకు సాగుతోంది. తెలంగాణ బిజెపిలో ఇప్పుడు నాయకత్వం కూడా బలంగా ఉంది. తెలంగాణ ప్రయోజనాల కంటే తనకు ఏదీ ముఖ్యం కాదని చెప్పుకునే కేసీఆర్ మొత్తంగా తన కుటుంబ ప్రయోజనాలే ముఖ్యమని గుర్తించి పనిచేస్తున్నారని ప్రజలు బలంగా నమ్మారు. దీంతో ఇక్కడ కెసిఆర్, అక్కడ జగన్ అధికారం కోల్పోక తప్పలేదు.

## దుబారాలపై నోరుమెదపని పాలకులు !

గతంలో కెసిఆర్ అధికారంలోకి రాగానే సకలజనుల సర్వే చేపట్టారు. అందులో ప్రజల వివరాలు అన్నీ నమోదయ్యాయి. వాటిని ఏం చేశారో తెలియదు. ఇప్పుడు



కొత్తగా బిసి గణన అంటున్నారు. కొత్తగా రేషన్ కార్డులు అంటున్నారు. ఇలా సర్వేలతో కాలం గడిపే బదులు ప్రజలకు ఏదైనా ప్రొఫార్మా అందిస్తే వారే గ్రామస్థాయిలో తమ ఆదాయ వ్యవయాలు, కులవృత్తులు, ఆస్తులు వంటి వివరాలు తెలియ చేస్తారు. ప్రజల ఆర్థిక పరిస్థితి తెలుసుకుని పథకాలు అమలు చేయాలి. అప్పుడే పేదరిక నిర్మూలన జరగగలదు. రాష్ట్రం ఏదైనా ఆర్థిక సమర్థత ఎంతన్నది బేరీజు వేయాలి. ఇల్లు మొదలకుని అన్ని వ్యక్తిగత వివరాలు సేకరించాలి. తెలంగాణలో కొత్త రేసన్ కార్డులకు తెరలేపారు. ఇప్పుడు ఇళ్లు, కార్డులు అనగానే ప్రతి ఒక్కరూ అర్హులమే నని తమ వివరాలను సిద్దం చేసుకుంటున్నారు. దీనికి ప్రాతిపదిక ఏదైనా పక్కాగా వివరల సేకరణ జరగాలి. అప్పుడే అసలుసిసలు లబ్దిదారులకు న్యాయం జరగగలదు. ఇక బియ్యం పథకాన్ని తీసుకుంటే కిలో రూపాయి బయ్యం పథకంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దుబారా జరుగుతోంది. ఎపిలో ఇటీవల టన్నుల కొద్దీ బియ్యం దేశం దాటించిన విషయాన్ని గుర్తించారు. పోర్టుల ద్వారా బియ్యం దాటిన వైనాన్ని ఆ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బయటపెట్టారు. తెలంగాణలో కూడా పౌరసరఫరాల శాఖ అప్పుల్లో కూరుకు పోయింది. ఇలా పథకం వృధా అవుతున్నప్పుడు అప్పుఉల మోయాల్సిన బాధ్యత ఉందా అన్న విషయాన్ని ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. పోటీపడి పాలకులు ఉచిత పథకాలను వరదలా పారిస్తున్నారు. ప్రజలు చెమటోడ్చి కడుతున్న పన్ను డబ్బులు పందేరం చేస్తున్నారు. ఎపిలో గత సిఎం జగన్ హయాంలో బటన్ నొక్కితే..కెసిఆర్ బటన్ నొక్కకుండానే పంచారు. అందుకే ఇద్దరు సిఎంలు కలసి రాష్ట్రాలను దివాళా తీయించారు. వారు ఓడినా హాయిగానే నాలుగు రాళ్లు వెనకేసుకుని బతుకుతున్నారు. కానీ రాష్ట్రాల ఖజానా ఎప్పుడో ఖాళీ అయ్యింది. ఇప్పుడు అప్పులు.. భూతంలా వెంటాడుతున్నాయి. ఇదేమిటని అడిగితే ..అప్పులు చేయకుంటే అభివృద్ధి ఎలా అని ఎదురుదాడి చేసారు. అప్పులతో ఆస్తులు సృష్టిస్తున్నామని, పేదల కడుపు నింపుతున్నామని ఘనంగా చెప్పుకున్నారు. సబ్సిడీ పథకాలకు ప్రజలను అలవాటు చేసి వారిని నిర్వీర్యులుగా చేయడంలో నేటికీ ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో కూలీలు దొరకడం కష్టంగా మారింది. వ్యవసాయ కూలీల సంగతి చెప్పనక్కర్లేదు. ధరల విషయంలో పల్లెలకు పట్టణాలకు తేడా లేకుండా పోయింది. కూలీనాలీ చేసుకునే వారు కిక్కులేనిదే ఉండడం లేదు. దీంతో సంపాదించిన దాంట్లో అధిక భాగం తాగడానికే తగలేస్తున్నారు. ఉపాధిహామీ కింద నిర్మాణాత్మక పనులు చేయించాలన్న డిమాండ్‌పై కేంద్రం నిర్ణయాలు తీసుకోవడం లేదు. వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్న వినతులను పక్కన పెట్టింది. ఉపాధి హామీకింద ఏటా వేలాది కోట్లు ఖర్చు చేస్తున్నా ..పనికి తగ్గట్లుగా చేసిన పనులు జరగడం లేదు. దీనిని సమీక్షించాలన్న కనీస పరిజ్ఞానం కూడా ప్రభుత్వానికి కలగడం లేదు. దీంతో గ్రామాల్లో వ్యవసాయ కూలీలు కరువయ్యారు. 140 కోట్ల జనాభా ఉన్న భారత దేశంలో కూలీలు ఎందుకు దొరకడం లేదన్న విషయం ప్రపంచాన్ని సైతం ఆందోళనకు గురి చేస్తోంది. దీన్ని ఎలా అధిగమించాలో ఆలోచన చేయడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా రూపాయికే కిలో బియ్యం పథకాన్ని కొనసాగించడం సబబుకాదని గుర్తించడం లేదు. రూపాయి బియ్యం తినేవారు ఇప్పుడు రాష్ట్రాల్లో ఎవ్వరూ లేరు. ఈ పథకాన్ని పునః సమీక్షించడం వల్ల వేలకోట్ల రూపాయల వృధాను అడ్డుకోవచ్చు. అయినా సమీక్షించడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సాహసించడం లేదు. రూపాయికి కొత్తతిమీర కట్ట కూడా రాని రోజుల్లోఈ పథకం కోసం వేలకోట్లు ప్రజల ధనాన్ని దుబారా చేస్తున్నారు. ఈ బియ్యం పథకం ప్రభుత్వాలకు గుదిబండగా మారినా ఓటు బ్యాంక్ కోసం దీని జోలికి వెళ్లడం లేదు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, ఎపిలో చంద్రబాబు కూడా ఈ పథకాల జోలికి వెళ్లడం లేదు. ఓట్లతో ముడిపడి ఉన్న ఈ పథకాన్ని తొలగించాల్సిందే. తెలుగు రాష్ట్రాల ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతున్న కిలో రూపాయి బియ్యాన్ని తక్షణం తొలగించడం ద్వారా ప్రజల సొమ్ముకు రక్షణగా నిలవాలి. బహిరంగ మార్కెట్‌లో కిలో 60 రూపాయలకు బియ్యం అమ్ముతున్నారు. ఇంత వ్యత్యాసంతో బియ్యం అందిస్తున్నా పేదలు ఈ బియ్యాన్ని అమ్ముకోవడం ద్వారా వ్యాపారాం చేస్తున్నారు. ఆర్థిక మాంద్యంతో అతలాకుతలం అవుతున్న ప్రస్తుత తరుణంలో ఈ పథకంపై సమీక్షించి అక్రమాలను అరికట్టాలి. కొందరికి ఈ పథకం వరంగా మారింది. బియ్యాన్ని హోటళ్లకు అమ్ముకుంటున్న ఘటనలు కూడా ఉన్నాయి. మరోవైపు కిలో రూపాయికే ఇస్తున్న చౌక బియ్యం అక్రమంగా రాష్ట్రాల సరిహద్దులు దాటుతున్నాయి. ఇటీవల ఎపిలో ఇలా సరిదహద్దులు దాటుతున్న బియ్యాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ పట్టుకున్నారు. పేదలు కడుపునిండా తినాలన్న ఈ పథకం ఇప్పుడు కొందరికి వ్యాపారంగా మారింది. మరికొందరికి ఆదాయ వనరుగా మారింది. అలాగే రీసైక్లింగ్ పేరుతో సన్నబియ్యంగా మార్చి అమ్ముకునే వ్యాపారంగా మారింది. చెక్‌పోస్టులు,తనిఖీ కేంద్రాలు, పోలీసులు ఉన్నా బియ్యం రవాణాను అడ్డుకోలేక పోతున్నారు. ఎవరి స్థాయిలో వారికి మామూళ్లు అందుతుండటంతో వ్యాపారం జోరుగా సాగుతోందన్నది కఠోర సత్యం. ఫలితంగా పేదలపేరుతో సర్కార్ అందచేస్తున్న బియ్యం అక్రమార్కులకు వ్యాపారంగా మారింది. రూపాయికి విలువ లేని సమయంలో కిలో బియ్యాన్ని అందచేసి అక్రమాలకు తావీయకుండా దీనిని ఎప్పుడో తొలగించాల్సింది. రైతు బజార్లను పటిష్టం చేసి అక్కడే అన్ని సరకులను తక్కువ ధరలకు అమ్మితే పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసినవారం అవుతాం. అంతేగాని రూపాయికే బియ్యం ఇచ్చి వృధాను ప్రోత్సహించడం ప్రభుత్వాలకు మంచిది కాదు. ఉమ్మడి ఎపిలో సబ్సిడీ బియ్యం ధరను పెంచినందుకు అప్పట్లో సిఎంగా ఉన్న చంద్రబాబుపై విమర్శలు చేశారు. ఆరోజుల్లోనే ఆయన దీనిని ఐదు రూపాయలకు పెంచారు. జాతీయ భద్రత చట్టం కింద కొంత కేంద్రం సబ్సిడీ బియ్యాన్ని అందిస్తోంది. మిగిలిన లక్షల కార్డులకు పంపిణీ చేస్తున్న బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వమే సబ్సిడీ భరించాల్సి వస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారం పడుతోంది. తెలంగాణలో సరిహద్దు గ్రామాల గుండా కర్నాటక, మహారాష్ట్రల్లో ఈ వ్యవహారం సాగుతోంది. రాత్రి వేళల్లో బియ్యాన్ని గోదాం నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గోదాంలో నిల్వ ఉంచిన బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించే బియ్యంలో కలిపే ప్రయత్నాలు నిత్యం జరుగుతున్నాయన్నఆరోపణలు ఉన్నాయి. దీనికి స్థానికంగా ఉన్న కొందరు డీలర్ల సహకారం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. స్థానికంగా ఉన్న కొందరి నేతల కనుసన్నల్లోనే ఇదంతా సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరించడంతో పట్టపగలే బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.



# తెలంగాణ తరపున సైబర్ కమాండో శిక్షణకు ఎంపికైన ప్రశాంత్ కుమార్

**వరంగల్ /సెప్టెంబర్ 21**
ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న కొద్ది అదే స్థాయిలో సైబర్ నేరగాళ్ళు కూడా అదే స్థాయిలో ప్రజల సొమ్మును దోచేస్తున్నారు. ప్రస్తుతం సైబర్ నేరాల సంఖ్య రోజు రోజుకి రెట్టింపు అవుతుందడంతో ఈ సైబర్ నేరాలను నియంత్రించడం కొసం ప్రధానమంత్రి అదేశాల మేరకు కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో నూతనంగా సైబర్ కమాండోల విభాగం ఏర్పాటుకు ప్రణాళికను రూపోందించడం జరిగింది. ఇందుకోసం ఈ విభాగంలో సైబర్ కమాండోలుగా విధులు నిర్వహించేందుకు దేశవ్యాప్తంగా వున్న పోలీస్, పారా మిలటరీ పోలీస్ విభాగంతో పాటు ఇతర భద్రత దళాల అనుబంధ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న నైపుణ్యం కలిగివున్న అధికారులను వివిధ రూపాల్లో పరీక్షలను నిర్వహించి తుదకు ఈ సైబర్ కమాండోలుగా ఎంపిక చేసుకొవడం జరిగింది. ఈ ఎంపికైన సైబర్ కమాండోలకు ఆరు నెలల కాలం తమిళనాడు తిరుచ్చి లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో(ఐ.ఐ.టీ) వీరికి సైబర్ నేరాల నియంత్రణ, సైబర్ నేరస్థుల గుర్తించడం, దర్యాప్తు, న్యాయవిచారణ మొదల్కెన అంశాలపై శిక్షణ అందజేయబడుతుంది. ప్రతిష్టాత్మకైన ఈ శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం తరుపున వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో డిప్యూటీ ఏ.ఓ గా విధులు నిర్వహిస్తున్న ఏ. ప్రశాంత్ కుమార్ ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రశాంత్ కుమార్ అభినందిస్తూ, శిక్షణ తరగతుల ఎంపిక కు సంబంధించిన ఉత్తర్వులను అందజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నైపుణ్యం కలిగి వున్న ఉద్యోగులు తమ విధుల్లో మరింత రాణించేందుకు అధికారులు ప్రోత్సహించడంతో పాటు ప్రోత్సహకాలు కూడా వుంటాయని పోలీస్ కమిషనర్ తెలిపారు.



# 28న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి




**వరంగల్ /సెప్టెంబర్ 21**
శనివారం రోజునా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.వి.నిర్మలా గీతాంబ,హనుమకొండ ఇంఛార్జి ప్రధాన న్యాయమూర్తి బి.అపర్ణా దేవి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రధాన న్యాయమూర్తులు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలను అనుసరించి, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తేదీ:28.09.2024 శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ ను వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టులలో నర్సంపేట, పర్కాల మండల కోర్టులలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు. కనుక కక్షిదారులు తమ వీలును బట్టి తమ కేసులను రాజీ కుదుర్చుకోవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడదగు క్రిమినల్, సివిల్ కేసులు, భూ తగాదాల కేసులు, మోటార్ వెహికిల్ యాక్సిడెంట్ కేసులు, వివాహ , కుటుంబ తగాదా కేసులు, బ్యాంకు, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్, డిజాస్టర్ మేనేజ్మెంట్ కేసులు, ఇన్సూరెన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, విద్యుత్ చోరీ, కన్సూమర్ ఫోరమ్ కేసులు, ట్రాఫిక్ ఈ-ఛాలన్ కేసులు, ప్రీ- లిటిగేషన్ కేసులు ఇతర రాజీపడదగు కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఈ జాతీయ లోక్ అదాలత్ నందు కక్షిదారులు హాజరు అయ్యి, తమ తమ కేసులను పరిష్కరించుకునేలా సిద్దం కావాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడదగు కక్షిదారులు తమ తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టులలో తెలియపరిచి, రాజీ కుదుర్చుకుని, కోర్టుల చుట్టూ తిరగకుండా ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించాలని తెలియజేశారు. రాజీపడదగు కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు నేరుగా హాజరు కావాలని తెలియజేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయుటకు గాను ఇప్పటికే పోలీసు అధికారులతో, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతోనూ, ఎక్సైజ్ శాఖ అధికారులతో, ఇన్సూరెన్స్ అధికారులతోనూ, న్యాయవాదుల తోనూ, బ్యాంకు, చిట్ ఫండ్ మేనేజర్లతో వేరు వేరు సమావేశాలు నిర్వహించి, అధిక కేసుల పరిష్కార దిశగా చర్యలు చేపట్టాం అని తెలిపారు. ఇప్పటివరకు వరంగల్ జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ లో గుర్తించబడిన కేసులలో మొత్తం 1477 రాజీపడదగు పెండింగ్ కేసులలోని కక్షిదారులకు నోటీసులు జారీ చేసి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశాం.

వీటిలో క్రిమినల్ - 1366, ఎన్.ఐ.యాక్ట్ - 19, ఎం.ఎ.సి.టి.- 55, ల్యాండ్ అక్విజిషన్ -04, మనీ రికవరీ-09, అదర్ సివిల్ -44, మరియు ప్రీ-లిటిగేషన్ ఎలక్ట్రిసిటి కేసులు-2200, బ్యాంక్ కేసులు - 1451, బి.ఎస్.యన్.ఎల్. కేసులు-212 అని తెలిపారు.హనుమకొండ జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ లో గుర్తించబడిన కేసులలో మొత్తం 1044 రాజీపడదగు పెండింగ్ కేసులలోని కక్షిదారులకు నోటీసులు జారీ చేసి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశాం. వీటిలో క్రిమినల్ - 737, ఎన్.ఐ.యాక్ట్ - 74, ఎం.ఎ.సి.టి.- 47, బ్యాంక్ రికవరీ-18, వివాహ సంబంధిత-76, అదర్ సివిల్ -92, మరియు ప్రీ-లిటిగేషన్ బ్యాంక్ కేసులు - 747, బి.ఎస్.యన్.ఎల్. కేసులు-269. అని తెలిపారు. రాజీ పడదగు కక్షిదారులు తమ వీలును బట్టి తమ కేసులను సాయంత్రం 5.00 గంటలలోపు ఏ రోజైనా రాజీ కుదుర్చుకునేలా ప్రీ-లోక్ అదాలత్ ను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఈ ప్రీ-లోక్ అదాలత్ లో ప్రీ- లిటిగేషన్ కేసులు ఇతర రాజీపడదగు కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్, ప్రి-లోక్ అదాలత్ పట్ల ఎటువంటి సలహాలకైననూ, సందేహాలకైననూ, ఏదేని న్యాయసహాయం కొరకు అయిననూ న్యాయసేవాధికార సంస్థ ను ఆశ్రయించి, ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందవలసిందిగా తెలిపారు.

# మండల స్థాయి క్రీడా పోటీల్లో రాహుల్ విజ్ఞాన్ విధ్యార్ధుల ఉత్తమ ప్రదర్శన



**చర్ల/ సెప్టెంబర్ 21**
చర్ల మండలంలో సత్యనారాయణపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోశుక్ర,శనివారం నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీల లో రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం విద్యార్థులు బాలికల విభాగంలో అలాగే బాలుర విభాగంలో వివిధ విభాగాలలో సత్తాచాటి ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి జోనల్ స్థాయికి ఎంపికయ్యారు.క్రీడా పోటీల్లో రాణించిన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్ లను రాహుల్ విద్యాలయం చైర్మన్ డాక్టర్ డి ఎన్ కుమార్ తో పాటు, ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయుల బృందం,విద్యార్థుల తల్లిదండ్రులు వారి అభినందనలను తెలియజేశారు..క్రీడలు విద్యార్థుల మానసిక ఉల్లాసా నికి అలాగే వారిలో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభ ను కనబరచడానికి ఎంతో దోహద పడతాయని, విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించడమే కాకుండా క్రీడా లలో సైతం రాహుల్ విద్యార్థులు రాణించడం ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు.. వాలీబాల్ సీనియర్ బాలికల విభాగంలో తొమ్మిదవ తరగతి విద్యార్థినిలు కే .జెస్విని,ఖో ఖో సీనియర్ విభాగంలో ఏం . సిరి వెన్నెల,జె .రుత్విక జెస్సి దొరలు ( 9వ తరగతి) మరియు ఖో ఖో జూనియర్ విభాగం లో %వా%. ఇందు (8వ తరగతి),లాంగ్ జంప్ విభాగంలో వీ .ప్రణవి,టి . శ్రీనిధి లు,అదేవిధంగా రన్నింగ్ విభాగంలో 8వ తరగతి విద్యార్థిని సహస్ర 100 మీట్లర్ల పరుగు పందెంలోరాణించి జోనల్ స్థాయికి ఎంపికయ్యారు..అదేవిధంగా బాలుర విభాగం లో వాలీబాల్ సీనియర్ బాలుర విభాగంలో పదవ తరగతి విద్యార్థులు ఎస్ కే .యాకూబ్, పి. ప్రణయ్ లు. వాలీబాల్ జూనియర్ విభాగం లో ఈ . చరణ్ తేజ (6వ తరగతి), సీహెచ్ .సాయి కిరణ్( 7వ తరగతి) "ఖోఖో సీనియర్ విభాగంలో %+%. వేస్లీ (10వ తరగతి), సీహెచ్ .చరణ్ సాయి (8వ తరగతి),ఖో ఖో జూనియర్ విభాగంలో పి . అభిరామ్( 8వ తరగతి), కబడ్డి సీనియర్ విభాగం లో కె .దేవి శ్రీ ప్రసాద్, పి .కృష్ణ చైతన్య,సీహెచ్ వరుణ్ రామ్, జి . శెషి కుమార్ లు (9వతరగతి), కబడ్డి జూనియర్ విభాగంలో కె .రామ్ చరణ్ (7 వతరగతి), అథ్లెటిక్ విభాగంలో కె .మనోహర్ 200 మీటర్ల పరుగు పందెంలో అలాగే వై . రేవంత్ 100 మీటర్ల పరుగు పందెం లో, అలాగే అండర్ -14 లో జి .విద్యా చరణ్ (7వ తరగతి),200 మీటర్లు మరియు 400 మీటర్ పరుగు పందెం లో సత్తా చాటారు.

# అన్ని రంగాలలో మహిళా వివక్ష!

**- రాజకీయాలలో మరింత వెనుకబాటు. - పారిశ్రామిక రంగాల్లో లేని ప్రోత్సాహం**

**- వ్యాపార రంగాలలో వెనుబాటుతనం. - విద్యా రంగాలలో కానరాని వ్యవస్థీకృతం**

**- స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక స్థానాలు మహిళలకే కేటాయించాలి - బొమ్మ ప్రవల్లిక అమర్ నేత**



**హైదరాబాద్ మేడ్చల్ / సెప్టెంబర్ 21**
విద్యావంతమైన సమాజంలో అన్ని రంగాలతో పాటు రాజకీయ రంగంలో కూడా మహిళలు వెనకబడిపోతున్నారని తెలంగాణ ప్రవేటు ఉద్యోగుల సంఘంరాష్ట్ర అధ్యక్షురాలు, మేడ్చల్ జిల్లా పద్మశాలి జిల్లా మహిళా అధ్యక్షురాలు బొమ్మ ప్రవల్లిక అమర్ నేత అన్నారు. పురుషాధిక్య సమాజంలో మహిళలను రాజకీయంగా అణచివేసే ప్రయత్నాలు జరగడం దురదృష్టకరమన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని సూచనలు చేయడం, ప్రకటనలు చేయడం తప్ప రాజకీయ పార్టీలు ప్రోత్సహిస్తున్న సందర్భాలు కనిపించడం లేదన్నారు. ఆకాశంలో సగమనే మాటలు తప్ప, మహిళలను రాజకీయాలలోకి రాకుండా చూస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో మహిళల్లో విద్యాదికుల శాతం తక్కువగా వుండేది. రాజకీయ చైతన్యం అంతంత మాత్రంగానే వుండేది. కానీ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో విజయాలు సాధిస్తున్నారు. అయినా మహిళలు అటు పారిశ్రామిక రంగంలో, విద్యా రంగంలో, క్రీడా రంగాలలో అనుకున్నంత ప్రోత్సాహకాలు అందడం లేదు. మహిళా సమాజంలో అనుకున్న లక్ష్యాలు సాధించాలంటే ముందు మహిళలు రాజకీయంగా ముందుకు వస్తేనే సమాజం మరింత పురోభివృద్ధిలోకి వస్తుంది. కేంద్ర ప్రభుత్వాలు మహిళా నాయకులకు తగు ప్రాధాన్యత కల్పించడం లేదని చెప్పారు. ఎన్నికల సమయంలో మహిళా నేతలను ముందు పెట్టి ప్రచారాలు సాగిస్తాయే తప్ప పదవుల పంపకాలలో వివక్ష చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు మహిళలను ప్రోత్సాహించే విధంగా నిరంతరం రాజకీయ సదస్సులు ఏర్పాటు చేయాల్సిన అవసరం వుంది. రాజకీయ పదవులలో కీలక భూమిక పోషించేలా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత కావాలి. మహిళలు రాజకీయాలలోకి రావాలని ప్రకటనలు చేస్తే సరిపోదన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాలు నామినేటె పోస్టలలో మహిళలకు విశేష ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఇక మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సాహిస్తూ మహిళా పారిశ్రామిక సదస్సులు ప్రభుత్వాలే ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ఇలా అన్ని రంగాలలో మహిళలకు ప్రోత్సాహం కల్పించినప్పుడే సామాజిక వికాసం జరుగుతుందన్నారు. అందుకోసం తాను ప్రత్యక్షంగా రంగంలోకి దిగుతానని, త్వరలో తన కార్యాచరణ ప్రకటిస్తానని ఆమె తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళల రిజర్వేషన్ తో పాటు, వెసులుబాటు వున్న అన్ని గ్రామాలలో, ఎంపిటిసి, జడ్పిటిసి. ప్రాదేశిక నియోజకవర్గాలలో అత్యధిక సీట్లు అందజేయాలని అన్ని రాజకీయ పార్టీలకు వినతిపత్రాలు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుడతామని ప్రవల్లిక అమర్ నేత వెల్లడించారు.

## వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ అద్వర్యంలో వ్యాసరచన పోటీలు

**హన్మకొండ /సెప్టెంబర్ 21**
హన్మకొండలోని వొకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రపంచ శాంతి దినోత్సవ సందర్భంగా వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు "విద్యార్థులు %ఆ% శాంతి స్థాపన"" అంశం పై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు
మహ్మద్ సిరాజుద్దీన్, అధ్యక్షులు ప్రొఫెసర్ సురేష్ లాల్ , సెక్రటరీ సుధాకర్, ఈ సి మెంబర్ మంజుల, సభ్యులు పరశురాములు కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్దులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన స్నేహ సేవా ఫౌండేషన్



**కమలాపూర్ /సెప్టెంబర్ 21**
హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని కానిపర్తి గ్రామంలో దాసరి బిక్షపతి వయసు 45 సంవత్సరాలు కులము మాల మృతి చెందాడు. అతని కుటుంబానికి స్నేహ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అతని ఇద్దరు కుమార్తెల పేరుపై చెరో పది వేయిల రూపాయలు సమృద్ధి యోజనా పథకంలో డిపాజిట్ చేశారు. అనంతరం 50 కేజీల బియ్యం అందజేశారు. స్నేహ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, స్నేహసేవా ఫౌండేషన్ వర్కింగ్ అధ్యక్షులు జనగాని సుమన్,ప్రధాన సలహాదారులు మాటూరి రమణాచారి, ఫౌండేషన్ అధ్యక్షులు పాగాల నరేందర్ రెడ్డి,ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు తొగరి హనుమయ్య ప్రసాద్ (దుబాయ్) సంయుక్త కార్యదర్శులు జనగాని కుమారస్వామి (దుకాణం) ఉపాధ్యక్షురాలు మాదిరెడ్డి సంధ్య రెడ్డి తొగరి అశోక్,సన్నపు రాంబాబు ,సన్నపు సూరయ్య(డాక్టర్) విరాళాలుగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శులు కోడిగుటి చేరాలు, జనగాని రమేష్, పెండెం ఉమారాణి, సన్నపు పద్మ , మీడియా కో ఆర్డి నెటర్ కతేర్ల క్రాంతి కుమార్ ప్రచారకార్యదర్శులు జనగాని అశోక్ బాడీ ఫ్రీజర్ కో ఆర్డి నెటర్ యాలాల ఎల్లస్వామి, సన్నపు కళావతి, తొగరి రేఖ, సన్నపు రాజయ్య, సన్నపు సురేందర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రీడా పోటీలకు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థుల ఎంపిక




**ఎల్కతుర్తి/ సెప్టెంబర్ 21**
ఎల్కతుర్తి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన 67వ ఎస్.జీ.ఎఫ్.ఐ కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ క్రీడల్లో మండల స్థాయి సెలక్షన్స్ లో ఇందిరానగర్ లోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకి ఎంపిక అయినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజు రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులను ఎంఈఓ రామ కిషన్ రాజు అభినందించారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థులను పాఠశాల మేనేజ్మెంట్ అభినందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, డీజీఎం చేతన్, ఏజీఎం పద్మాకర్, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, డీన్ రజనీకాంత్, సీ ఇంచార్జీ మధు, పీఈటీలు ఉదయ్, రవళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం పోరాడిన నేత కొండా లక్ష్మణ్ బాపూజీ



**చిగురుమామిడి /సెప్టెంబర్ 21**
తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం తన జీవితకాలం పోరాడిన తొలితరం నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వంగర మల్లేశం అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతిని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం చిగురుమామిడి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంగర మల్లేశం మాట్లాడుతూ తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన బాపూజీ స్ఫూర్తి రాష్ట్ర సాధన పోరాటంలో ఇమిడివున్నదన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని వారి కృషిని పద్మశాలి సంఘం నాయకులు స్మరించుకున్నారు. పద్మశాలి రాజకీయ విభాగ రాష్ట్ర అధికారప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత మాట్లాడుతూ బాపూజీ ప్రదర్శించిన నిక్కచ్చితనం, నిరాడంబరత లక్ష్య సాధనకోసం తాను కనబరిచిన పట్టుదల సమాజాన్ని ప్రభావితం చేశాయని అన్నారు. న్యాయవాదిగా, రాజనీతిజ్ఞుడుగా స్వాతంత్రోద్యమకాలం నుంచి రాష్ట్ర సాధన చివరిదశ దాకా బాపూజీ చేసిన కృషిని రేపటి తరాలకు ఆదర్శమని దాసరి ప్రవీణ్ నేత అన్నారు. ప్రజాపాలనలో టెక్స్ టైల్స్ అండ్ హ్యాండ్లూమ్ వర్సిటికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుగా మారుస్తూ నిర్ణయం తీసుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి మంచికట్ల కనకయ్య, చిగురుమామిడి గ్రామ అధ్యక్షుడు బైరి శ్రీనివాస్, నాయకులు నరాల రాజయ్య, బొల్లబొత్తిని రవీందర్, నరాల తిరుపతి, దాసరి సదానందం, ఎన్నం వెంకటేశం, మోర పద్మనాభం, వంగ శ్రీహరి, మోర కనకయ్య, దాసరి రవి, చిమ్మన నాగరాజు, బల్లు శేఖర్, సుధాకర్, మోర వీరయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశం

**కరీంనగర్ /సెప్టెంబర్ 21**
తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్త పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వేముల లక్ష్మిప్రసాద్ కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాసికూటర్ల సమస్యలు, సందేహాలపై చర్చించారు. క్రిమినల్ కేసులు విచారణకు వచ్చే ముందు ప్రాసిక్యూటర్లు వాటిపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని, వాటిలో నిందితులకు శిక్షలు పడేలా దృష్టి సారించాలని ఆయన తెలిపారు. ఈ నెల 28న నిర్వహిస్తున్న జాతీయ లోక్ ఆదాలత్ లకు ఇంచార్జ్ ప్రసిక్యూటర్లను ప్రకటించారు.అనంతరం వేములవాడ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విక్రాంత్ కొత్త చట్టాల లోని ఎలక్ట్రానిక్ సాక్షాల గూర్చిమీడియా ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సమీక్షా సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్,అడిషనల్ పబ్లిక్ ప్రాసి క్యూటర్లు ,జ్యోతి రెడ్డి, శరత్, పెంట శ్రీనివాస్ ఆరెల్లి రాములు, జూలూరి శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి,గడ్డం లక్ష్మణ్ , కాసారపు మల్లేశం పాల్గొన్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101